క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో సీపీఆర్‌పై ఆరోగ్య శాఖ వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణరక్షణపై వివరించారు. ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీటీసీలు, మెడికల్ అధికారులు దివ్య, సంపత్ పాల్గొన్నారు.

కంటి వెలుగు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఎమ్మార్వో విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ పోచవేణి సత్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు

బోయినపల్లి: మేడే విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం మండల కేంద్రంలో హమాలీ సంఘ కార్మికులు విడుదల చేశారు. మే డే రోజున మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే జెండా ఆవిష్కరణకు కార్మికులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ గురజాల శ్రీధర్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిదరోతున్న నిఘా!

- నిర్వహణ లేక నిరుపయోగంగా సీసీ కెమెరాలు
- పెరుగుతున్న దొంగతనాలు
- ఆపరేటర్ లేక విజువల్స్ సేకరణకు ఇబ్బంది



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మ్యాకల శ్రీనివాస్. రుద్రంగికి చెందిన ఇతడు ఇందిరాచౌక్ ఆవరణలో ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. బంధువుల ఇంట్లో పండగ ఉండడంతో ఇంటిల్లిపాది సాయంత్రం వెళ్లి, రాత్రి 10 గంటల వరకు తిరిగి వచ్చారు. అంతలోనే వారింట్లో దొంగలు పడి రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. తాము వచ్చేది గమనించి దొంగలు గోడ దూకి పారిపోయారని, లేకుంటే ఇంకా ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు పోయేవని, సుమారుగా రూ.7 లక్షల వరకు నష్టపోయేవాళ్లమని వాపోయాడు. ఉదయం ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సిబ్బంది లేరు. ×డబ్బులు ఇంట్లో ఎందుకు పెట్టుకున్నారు, మీరే జాగ్రత్తగా ఉండాలి³ అని పోలీసులు అన్నట్లు బాధితుడు తెలిపాడు. సిబ్బంది లేకున్నా కనీసం సీసీ కెమెరా ఫుటేజీలు చెక్ చేసి ఉంటే దొంగలు దొరికే వారేమోనని శ్రీనివాస్ అంటున్నాడు.



రుద్రంగి ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



ఇతని పేరు గడ్డం మహేందర్. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఈ రైతు ఒక ఎకరంలో పసుపు సాగు చేశాడు. పసుపు తీయడం ముగించుకొని రుద్రంగి తాతమ్మ ఆలయం ఆవరణలో పసుపు ఉడకబెట్టి ఆరబెట్టాడు. ఆరిన తరువాత మిషన్‌లో పోసి సాఫ్ చేశాడు. తెల్లారి మెట్‌పెల్లిలోని పసుపు మార్కెట్‌కు పోయి అమ్ముదామనుకున్నాడు. అదేరోజు రాత్రి దొంగలు సుమారు ఐదు క్వింటాళ్ల పసుపు ఎత్తుకుపోయారు. సుమారు రూ.30 వేల వరకు నష్టపోయానని రైతు మహేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీసీ కెమెరాల్లో చూడాలని కోరగా ఆపరేటర్ లేదని పోలీసులు తెలిపారని బాధితుడు వాపోయాడు. సీసీ కెమెరాల్లో ఫుటేజీ చూసి ఉంటే దొంగలు దొరికేవారని అంటున్నాడు.

మూడు ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

మండల కేంద్రంలోని అంబేద్కర్, ఇందిరాచౌక్, మానాలకు వెళ్లే దారిలో మూడు ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి రావాలన్నా పోవాలన్నా ఈ మూడే దారులున్నాయి. ఈ సీసీ కెమెరాలను పరిశీలిస్తే నేరస్తులను సులువుగా పట్టుకోవచ్చని గ్రామస్తులు అంటున్నారు.

రుద్రంగి: మండలంలో ఈ రెండు సంఘటనలే కాదు. నాలుగు నెలల్లో 7 ఇళ్లలో దొంగతనాలు జరిగి నగదు, బంగారు ఆభరణాలు పోగొట్టుకొని లక్షల్లో నష్టపోయారు. ప్రజలు, సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేసినా, వాటిని సక్రమంగా వినియోగించుకున్నా దొంగలు దొరికేవారని తమకు ఇంత నష్టం కలిగేదికాదని వారు వాపోతున్నారు.నేరాల నియంత్రణకు ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయినా వాటి విజువల్స్‌ను నేరస్తులను పట్టుకోవడానికి వినియోగించుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు రుద్రంగి మండలంలో జరిగిన దొంగతనాల్లో దొంగలను పట్టుకోవడానికి సీసీ కెమెరాలను వినియోగించకపోవడమే ఇందుకు నిదర్శనమని చర్చించుకుంటున్నారు.

7 ఇళ్లలో చోరీ

గడిచిన నాలుగు నెలల్లో రుద్రంగి మండలంలో ఏడు ఇళ్లలో దొంగలు దోపిడికి పాల్పడ్డారు. అయితే అన్ని ఇళ్లల్లో వారు ఊళ్లో లేని సమయంలోనే ఈ సంఘటనలు జరుగుతున్నాయి. దీంతో ఊర్లో వారే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు, బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే నిజమైతే ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఎవరెవరు అనుమానస్పదంగా తిరుగుతున్నారనేది పోలీసులు సీసీ కెమెరాల్లో పరిశీలిస్తే దొంగలు దొరికే అవకాశం ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సీసీ కెమెరాల పనితీరుపై అనుమానం

అసలు రుద్రంగి మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేస్తున్నాయో.? లేదో.? అనే అనుమానాలు మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాల నిర్వహణ లేక అవి సక్రమంగా పనిచేయడం లేదని, పని చేస్తే రికార్డయిన విజువల్స్ పరిశీలించి దొంగలను పట్టుకోవడంలో ఇబ్బంది ఏముంటుందంటున్నారు.

నాలుగు నెలల్లో జరిగిన దొంగతనాలు

➡ మండల కేంద్రంలో సాయిబాబా ఆలయం ఆవరణలో ఉండే ఒక ముస్లిం ఇంట్లో సుమారు 11 తులాల బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు.
➡ మానాల గ్రామంలో ఒకరి ఇంట్లో సుమారు 8 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
➡ రుద్రంగి ఆదర్శనగర్‌కు చెందిన ఓ రైతు ఇంట్లో నుంచి పెళ్లికి వెళ్లి వచ్చే సరికి దొంగలు పడి నగదు, తులం బంగాంరం ఎత్తుకెళ్లారు.
➡ ఇందిరాచౌక్ ఆవరణలో గల రైతు ఇంట్లో నుంచి ఏడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
➡ అదే ప్రాంతంలో మ్యాకల శ్రీనివాస్ అనే ఎలక్ట్రికల్ షాప్ నిర్వాహకుడి ఇంట్లో నుంచి రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు.
➡ గడ్డం మహేందర్ అనే రైతుకు చెందిన 5 క్వింటాళ్ల పసుపును ఎత్తుకెళ్లారు.
➡ రుద్రంగి అంబేద్కర్ ఆవరణలోని ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో నగదు బంగారం ఎత్తుకెళ్లారు.

సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి



సీసీ కెమెరాలు సక్రమంగానే పనిచేస్తున్నాయి. సిబ్బంది కొరతతో కొంచెం ఇబ్బంది పడుతున్నాం. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను వినియోగించుకుంటాం.

– ప్రభాకర్, ఎస్సై, రుద్రంగి

ప్రజా సమస్యలపై పోరాడుతాం

సిరిసిల్లటౌన్: ప్రజా సమస్యల సాధనకై పోరాటం చేస్తామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ పోస్టర్లను శుక్రవారం సిరిసిల్ల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో మే 7న హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, యూపీ మాజీ సీఎం మాయావతి విచ్చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్ల ఇన్‌చార్జిలు రాంచంద్రం, మ్యాకల మునీందర్, లింగంపల్లి మధుకర్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి భాను

సమాజ రక్షణ పోలీసుల బాధ్యత

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి: సమాజ రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సనుగుల గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రాత్రి పోలీస్ మీ కోసం కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రతే మా బాధ్యతనని అన్నారు. యువత పట్టుదలతో చదువుకొని సన్మార్గంలో పయనించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగి పోయాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి చెప్పొద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్‌ను తప్పక ధరించాలన్నారు. వాహనాదారులు ఆర్‌సీ, ఇన్సూరెన్స్ కాగితాలు వెంట ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో అటవీ శివారు ప్రాంతాలను అనుకుని వ్యవసాయ పంటలు సాగుచేసే రైతులు వన్యప్రాణుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలను అమర్చవద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎల్లవేళలా పోలీసులు సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేసేందుకు పోలీస్ మీ కోసం కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేశ్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

తూకం వేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రుద్రంగి: ఇటీవల కురిసిన వడగండ్లకు పంటలు నేలపాలయ్యాయని, మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే తూకం వేయడం లేదని.. వెంటనే కాంటా పెట్టాలని డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి కోరారు. రుద్రంగిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు సామ మోహన్ రెడ్డి, గండి నారాయణ, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె మనోహర్, లింగం తదితరులు ఉన్నారు.

రైతుల ఆందోళన



అల్మాస్‌పూర్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ఆరోపిస్తూ రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వడగండ్ల వానతో సగం రాలిపోగా, మిగిలిన వడ్లను కేంద్రానికి తీసుకొస్తే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కాంటా పెట్టలేదన్నారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు చల్ల భూంరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణహరి, రాములు, రంగయ్య, ఎల్లయ్య, రాజేశం, సాయి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

రుద్రంగి: వరి పంటపై పంట కోత ప్రయోగంలో భాగంగా శుక్రవారం రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బోయిని చెంద్రయ్య వరి పొలంలో డివిజనల్ ఉప గణాంక అధికారి వెల్ది కిషన్ రావు సమక్షంలో ఎంపీఎస్‌వో కామని గణేశ్ పంటకోత ప్రయోగం చేశారు. యాసంగిలో ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా వడగండ్లతో 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చి ఐదు క్వింటాళ్ల దిగుబడి తగ్గిందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య



నారాయణపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు

సిరిసిల్లఅర్బన్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు, 1వ వార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, ఎమ్మార్వో విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచే శ్రీనివాస్, కౌన్సిలర్లు పోచవేణి సత్య, ఆడెపు సౌజన్య, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు అగ్గి రాములు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నారాయణపూర్‌లో..

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, ఎల్లారెడ్డిపేటలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీలు అపెరా సుల్తానా, అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కేజ్ వీల్స్‌తో రహదారులు నాశనం

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల రహదారులు కేజ్ వీల్స్ కారణంగా దెబ్బతింటున్నాయి. పదికాలాల పాటు మన్నాల్సిన రహదారులు పనికిరాకుండా పోతున్నాయి. రహదారులపై కేజ్ వీల్స్‌ను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యపై ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, ఏఈ, పంచాయతీరాజ్, ఫోన్ నెం. 62816 63292

అంగన్‌వాడీల్లో సంబరాలు



సామూహిక సీమంతాలు



చిన్నారుల నృత్యాలు

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్: చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులతో నృత్యాలతో జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహిస్తున్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట మండల సెక్టార్‌లోని రాచర్లబొప్పాపూర్, వేములవాడ మండలంలోని వట్టెంల, వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి, 1, 2 మినీ అంగన్‌వాడీ స్కూళ్లలో వారోత్సవాలు నిర్వహించారు. పిల్లలకు, తల్లిదండ్రులకు పోషకాహారాలపై అవగాహన కల్పించారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు అభివృద్ధి కార్డు అందజేశారు. ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్లు మోతె సరిత, కళావతి, నిర్మలాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు చేపట్టాలి

ఇల్లంతకుంట: మండలంలోని గ్రామాల్లో పేరుకే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి ఇప్పటి వరకు తూకం వేయడం లేదని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మ్యాకల మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆగమవుతున్నారని, తేమ శాతం వచ్చినా రాకున్న కొనుగోళ్ల చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో అకాల వర్షాలతో ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన నిరుపేద సుల్తాన్ కనుకవ్వ కుటుంబానికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ 50 కిలోల బియ్యాన్ని పంపించగా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ పిరోజ్ పాషా, నాయకులు శుక్రవారం అందించారు.

ప్రమాదకరంగా మూలమలుపు



కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని మల్కపేట, బావుసాయిపేట-వెంకట్రావుపేట, వట్టిమల్ల, నిమ్మపల్లి శివారు గ్రామాల్లో మూలమలుపులు వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని జేపీనగర్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జేపీనగర్, పద్మనగర్, అంబికానగర్, అశోక్‌నగర్, వెంకంపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తంగళ్లపల్లి మండలంలో..

తంగళ్లపల్లి: మండలం కస్బేకట్కూర్, అంకిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాళ్లపేట, ఓబులాపూర్, మండెపల్లి, కస్బేకట్కూర్, వేణుగోపాలపూర్, గండిలచ్చపేట, అంకిరెడ్డిపల్లె గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం వివరాలను తెలియ జేస్తామన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



తడగొండలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

బోయినపల్లి: వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరాన రూ.35 వేలు నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని తడగొండ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. నర్సింహాచారి, కొనుకటి హరీశ్, సింగరి వెంకటేశ్, రేండ్ల మహిపాల్ పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ముస్తాబాద్: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఒరుగంటి తిరుపతి, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు కోరారు. ముస్తాబాద్‌లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించి, ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

ఇసుక డంపు తనిఖీ



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఆర్‌ఐ

రుద్రంగి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, డంపు చేసిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో నిలువ చేసిన ఇసుక డంపులను ఆర్‌ఐ నవీన్, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించి తనిఖీ చేయించారు. ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది అనుమతి పత్రాలను పరిశీలించారు.

వికలాంగుడికి ట్రై సైకిల్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గ్రామానికి చెందిన నారాయణ అనే వికలాంగుడికి మంజూరైన ట్రై సైకిల్‌ను శుక్రవారం సర్పంచ్ కదిరె రజిత పంపిణీ చేశారు